క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు



చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలోని చాముండేశ్వరీ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఈ మేరకు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు, ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

ప్రయాస-2025కు ఎంజేపీ విద్యార్థి ఎంపిక



సాత్విక్‌నాయక్

హవేళీఘణాపూర్(మెదక్): జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రయాస-2025 సైన్స్ కార్యక్రమానికి 9వ తరగతి విద్యార్థి సాత్విక్‌నాయక్ ఎంపిక కావడం అభినందనీయమని ఎంజేపీ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ సృజన ఆదివారం తెలిపారు. ఇటీవల ఎన్‌సీఆర్‌టీ ఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయ ఆహార విధానం-డయాలసిస్' ప్రాజెక్టును గైడ్ టీచర్ సాయిబాబ ప్రోత్సాహంతో వినూత్న ప్రాజెక్టు చేసి సోమవారం ఆన్‌లైన్‌లో జరిగే ఇంటర్వ్యూకు ఎంపికయ్యారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆమె తెలిపారు.

కాంగ్రెస్ నేతకు పరామర్శ



పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చిట్కుల మహిపాల్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పరామర్శించారు. ఆదివారం పట్టణంలోని శుభం గార్డెన్‌లో మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలు తల్లి లక్ష్మీ దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు కాంగ్రెస్ నాయకులు, నాయకులు, స్థానికులు కలిసి నివాళులర్పించారు.

మాజీ మంత్రిని కలిసిన నాయకులు



మాజీ మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న అశోక్‌గౌడ్

నర్సాపూర్: మాజీ మంత్రి హరీశ్‌రావును మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆదివారం కలిశారు. ఈ మేరకు మున్సిపాలిటీకి రూ.15 కోట్లు మంజూరు కావడంతో ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. నిధులు వచ్చేందుకు కృషి చేసినందుకు గాను హరీశ్ రావును శాలువాతో సన్మానించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటు



పైప్‌లైన్ పనులు చేయిస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సీతారంతండాలో నెలకొన్న నీటి ఎద్దడిని తీర్చేందుకు బీఆర్ఎస్ నాయకుడు రాజేందర్ నాయక్ ఆదివారం పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తండాలో బోరు బావి నుంచి ట్యాంకు వరకు 200 మీటర్ల పైప్ లైన్ పనులు చేపట్టారు. అయితే కొంతకాలంగా రక్షిత వాటర్ ట్యాంకు నుంచి నీరు రాకపోవడంతో తండా వాసులు పొలాల్లోని బోరుబావుల్లో నుంచి నీళ్లు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తన దృష్టికి రావడంతో సొంత నిధులతో పైప్ లైన్ వేసినట్లు రాజేందర్ చెప్పారు.

పేదలకు దుప్పట్ల అందజేత

గజ్వేల్: గజ్వేల్‌లోని కిరాణావర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పేదలకు సహకారం అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సిద్ధి భిక్షపతి, కార్యదర్శి దూబకుంట మైత్రాములు, నాయకులు ప్రభాకర్, కాపర్తి వైకుంఠం, శ్రీనివాస్, రాము, లింగం, ప్రసాద్ పాల్గొన్నారు.

నీట మునిగిన ఆశలు

- వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న పంటలు
- నిండిన చెరువులు, కుంటలు



రేగోడ్: నీటిలో మునిగిన పత్తిపంట

రేగోడ్(మెదక్): కొంతకాలంగా కురుస్తున్న వర్షాలకు రైతుల ఆశలను ముంచేశాయి. ఈ వర్షాలకు చెరువులు, కుంటలు పొంగి పొలాల్లో వరి, పత్తి పంటలు నీటమునిగాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల ప్రకారం.. మండలంలో ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు పత్తి, వరితో పాటు ఆయా పంటలు నీట మునిగి పాడైపోయాయి. అయితే పెట్టిన పెట్టుబడులు కూడా రావేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి. ఈ వర్షాలకు జగిర్యాల చెరువు అలుగు పారుతోంది. ప్రభుత్వం స్పందించి తక్షణమే పంటనష్ట పరిహారం మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

పోచారానికి పోటెత్తిన వరద



దూప్‌సింగ్ తండాకు వెళ్లే బ్రిడ్జిపై పారుతున్న నీరు

హవేళీఘణాపూర్(మెదక్): మెదక్-కామారెడ్డి జిల్లా సరిహద్దులో ఉన్న పోచారం డ్యాంకు గంగమ్మ వాగు నుంచి పెద్ద ఎత్తున వరద ప్రవహిస్తుంది. కాగా, కామారెడ్డి జిల్లాలో శనివారం కురిసిన భారీ వర్షాలకు గంగమ్మ వాగు నుంచి వరద పోటెత్తడంతో దూప్‌సింగ్ తండాకు వెళ్లే బ్రిడ్జి మునిగి రాకపోకలు నిలిచిపోయాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్



కౌడిపల్లి(నర్సాపూర్): మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

కౌడిపల్లి(నర్సాపూర్): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ తెలిపారు. ఆదివారం మండల బీజేపీ నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రచారం చేయాలన్నారు. అన్ని పంచాయతీల్లో వార్డు సభ్యులు, సర్పంచ్‌తోపాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు గెలిచేలా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మండల అధ్యక్షుడు రాకేష్, అశోక్, శేఖులు, కృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కృషి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతంగా ఉందని బీజేపీ మండల ఇన్‌చార్జ్ గుండం శంకర్ అన్నారు. ఆదివారం ఆయన బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నగేష్ యాదవ్, జిల్లా కార్యదర్శి సత్యనారాయణగౌడ్, మాజీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువజన మిత్రుల అలయ్ బలయ్



ఉద్యోగాలు పొందిన వారిని సన్మానిస్తున్న యువజన మిత్రులు

గజ్వేల్‌రూరల్: యువజన మిత్రుల అలయ్‌బలయ్ కార్యక్రమం గజ్వేల్‌లో ఘనంగా జరిగింది. గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు వర్గల్, జగదేవ్‌పూర్, మర్కుక్, రాయపోల్ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన యువజన నాయకులతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. యువత విద్య, వ్యాపార, రాజకీయ, సేవా రంగాల్లో రాణించి తమదైన ముద్ర వేయాలన్నారు. పార్టీల కతీతంగా యువతను ప్రోత్సహించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలో అలయ్‌బలయ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని, ప్రతియేటా పార్టీలకతీతంగా ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టరేట్ పొందిన దేశబోయిన నర్సింహులు, గంగాల నరేశ్, ఎక్సైజ్ ఎస్ఐగా ఉద్యోగం పొందిన సలీంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో కొనసాగుతున్న యువజన మిత్రులు పాల్గొన్నారు.

క్రీడాధికారికి సన్మానం

సిద్దిపేటజోన్: జిల్లా క్రీడలశాఖ అధికారి వెంకట్ నర్సయ్యను తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివానం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని ఒలింపిక్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. సైకిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక మందిని జాతీయస్థాయిలో ప్రాతినిథ్యం వహించేలా కృషిచేసిన ఆయనను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, అంతర్జాతీయ సైకిలింగ్ క్రీడాకారుడు మాక్స్‌వెల్ ట్రావర్ పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి నిమజ్జనం



పెద్దశంకరంపేటలో సాంస్కృతిక ప్రదర్శనలు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఆదివారం అమ్మవారి నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో గంగపుత్ర యూత్, శ్రీరామ్‌సేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో యువకులు, మహిళల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.



చేగుంట హనుమాన్ యూత్ అమ్మవారి ఊరేగింపులో నృత్యం చేస్తున్న యువతులు

సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఊరేగింపు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో హనుమాన్ యూత్ అమ్మవారి నిమజ్జన ఊరేగింపును ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద ప్రొఫెషనల్ ఈవెంట్ బృందం సభ్యులతో నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణం పాట్లు

బస్సులు లేక అవస్థలు



జహీరాబాద్ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

జహీరాబాద్ టౌన్: దసరా పండుగకు సొంత ఊళ్లకు వచ్చిన ప్రజలు పండుగ ముగియడంతో తిరుగు ప్రయాణమవుతున్నారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రయాణికులతో ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసింది. ఉద్యోగం, ఉపాధి, విద్యాభ్యాసం తదితర పనుల కోసం నగరాలకు వెళ్లిన వారంతా పండగకు ముందు నుంచే సొంత ఇళ్లకు వస్తుంటారు. దసరా సెలవులు ముగియడంతో గ్రామీణ ప్రాంతాలకు వచ్చిన ప్రజలు మళ్లీ హైదరాబాద్ తదితర నగరాలకు వెళ్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేక ప్రజలు నానా పాట్లు పడ్డారు. బస్సు వచ్చిందంటే చాలు సీటు కోసం పరుగులు తీయడం కనిపించింది. బస్సుల కోసం ప్రజలు బస్టాండ్‌లో గంటల తరబడి ఎదురుచూశారు. సెక్యూరిటీ బందోబస్తు మధ్య ప్రయాణికులు బస్సుల్లో ఎక్కడం కనిపించింది.

నీటి సమస్యపై అధికారుల్లో కదలిక



నీటి సమస్యను తెలుసుకుంటున్న షేక్ పాషా

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు ఆందోళన చేయటంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఆదివారం ఖాజాపూర్ గ్రామాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ షేక్ పాషా సందర్శించారు. గ్రామంలో తిరిగి సమస్యను తెలుసుకున్నారు. మంచి నీటి పథకం బోర్లు పరిశీలించారు. కొత్తగా బోరు మోటార్‌ను పంచాయతీ సిబ్బందికి అప్పగించారు. సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట మిషన్‌భగీరథ గ్రిడ్ ఏఈ జైపాల్ ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానించిన నాయకులు

జహీరాబాద్ టౌన్: నీట్(ఎంబీబీఎస్) కౌన్సిలింగ్‌లో మెడికల్ సీట్లు సాధించిన గిరిజన విద్యార్థులను తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం(టీబెస్) ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. మండలంలోని మధులై తండాకు చెందిన వైష్ణవి పవార్, నందునాయక్ తండాకు చెందిన సావిత్రి, మండగుబ్బడి తండావాసి బాలరాం, కుంచారంపల్లి తండాకు చెందిన దీపక్ నీట్‌లో ర్యాంకులు సాధించి మెడికల్ కాలేజీలో ప్రవేశాలు పొందారు. స్థానిక బంజార భవన్‌లో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీబెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్, నాయకులు అర్జున్, రమేశ్‌బానోత్ పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో శోభాయాత్ర



నిజాంపేటలో పథసంచాలన్ కవాతు

కదం తొక్కిన కర సేవకులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద ప్రారంభమైన పథ సంచలన్ శోభాయాత్రలో ఆయా గ్రామాల కర సేవకులు కదం తొక్కారు. భరతమాత, హెడ్గేవార్, గురూజీ చిత్రపటాలను రథంపై ఏర్పాటు చేసి శోభాయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ బాధ్యులు జైహింద్‌రెడ్డి, సీతారాం, రవివర్మ, సతీష్‌గౌడ్, మధు, శ్రావణ్, విశ్వేశ్వర్, శివశంకర్, సురేష్, వంశీ, క్రాంతీలాల్, వెంకట్, రాములు తదితరులున్నారు.

సేవకుల ర్యాలీ

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కర సేవకులు కవాత్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఏడీసీ వెంకటేశం, నగర సంఘచాలక్ భానుచందర్, రామాయంపేట ఖండ కార్యవాహ కొన్యాల సోమరాజు, రామాయంపేట ఖండ సహకార్యవాహ కొమ్మాట నరేందర్, నిజాంపేట ఉపమండల ప్రముఖ్ శెనిగేపల్లి తిరుపతి, సిద్ధరాంరెడ్డి, జీపీ స్వామి, మహేష్ పాల్గొన్నారు.

దేశ సేవలో తరిద్దాం

పాపన్నపేట(మెదక్): ఆర్ఎస్ఎస్ సేవకులుగా దేశ సేవలో తరిద్దామని ఆర్ఎస్ఎస్ జిల్లా విభాగ్ కార్యదర్శి భూషణం పిలుపు నిచ్చారు. ఆదివారం పాపన్నపేటలో పద సంచలన్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ వికాస్ ప్రచారక్ కృష్ణారెడ్డి, గ్రామీణ వికాస్ బౌద్ధిక్ రవి, సేవక్‌లు బీకొండ రాములు, సాయిలు ఉన్నారు.

ఆర్ఎస్ఎస్ శోభాయాత్ర

కొల్చారం(నర్సాపూర్): ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని రంగంపేటలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో డాక్టర్ హెగ్డే వార్, భారత మాత చిత్రపటాల నుంచి కాషాయ ధ్వజాన్ని ఎగరవేశారు. అనంతరం సంఘ్ గీతాన్ని ఆలపించారు.

ట్యాంకర్‌తో ఉచిత నీటి సరఫరా



ట్యాంకర్‌తో ఉచితంగా నీటిని సరఫరా చేస్తున్న నాయకులు

నర్సాపూర్: మున్సిపాలిటీలోని రెండో వార్డులో ఉచితంగా నీటి సరఫరా చేసేందుకు ట్యాంకర్ ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ వార్డు ఇన్‌చార్జ్ సుధీర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలో సాంకేతిక కారణాలతో నల్లాల ద్వారా నీళ్లు తక్కువగా వస్తున్నాయన్నారు. ఈ మేరకు తలెత్తిన నీటి సమస్యను అధిగమించేందుకు ఉచితంగా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే వార్డు పరిధిలో ట్యాంకర్ ఏర్పాటు చేసి నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. వార్డులోని ప్రతి కుటుంబానికి నీటి సరఫరా చేయనున్నట్లు సుధీర్‌గౌడ్ వివరించారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు



తునికి ఆలయంలో నల్లపోచమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి శివ్వప్ప నల్లపోచమ్మ దేవికి పంచామృతాలతో అభిషేకం చేసి అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారి దర్శనం కల్పించగా పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

శివాయిపల్లి మట్టి రోడ్డుకు మోక్షమెప్పుడో?



బురదమయంగా మారిన శివాయిపల్లి రోడ్డు

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కోంటూర్-రాయిన్‌పల్లి రోడ్డు నుంచి శివాయిపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. ఈ రోడ్డుపై వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో శివాయిపల్లి నుంచి రాత్రి వేళల్లో కోంటూర్ మీదుగా మెదక్ ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు భయానక పరిస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి మరమ్మతులు చేయకపోవడంతో గుంతలమయంగా మారింది. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డుపై నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గుంతలమయంగా ఉన్న రోడ్డును మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులేవీ?

- వరదలకు ధ్వంసమైన రహదారులు
- పలు గ్రామాల మీదుగా నిలిచిన బస్సు సర్వీసులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు



శివాయిపల్లి శివారులో కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్(ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదలు సంభవించి రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇందులో భాగంగానే మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ రహదారులకు కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి(ఫైల్)

కోతకు గురైన బీటీ రోడ్లు..

భారీ వర్షాలు ప్రజలను అతలాకుతలం చేశాయి. పలు గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా రహదారులపై నుంచి నీరు ప్రవహించడంతో చాలా చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. పెద్దశంకరంపేట మండలంలోని జూకల్ శివారుతో పాటు దానంపల్లి, శివాయిపల్లి వద్ద నార్సింగ్ వెళ్లే రహదారి, జమ్లానాయక్‌తండా వద్ద రోడ్డు, కల్వర్టులు కొట్టుకుపోయాయి.

- జూకల్ శివారులో చీకోడ్ వెళ్లే దారిలో రోడ్డుపై గుంత ఏర్పడడంతో పాటు పక్కన రోడ్డు కోతకు గురైంది. దీంతో బస్సుల రాకపోకలు బంద్ అయ్యాయి.
- శివాయిపల్లి వద్ద రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. దీంతో నార్సింగ్‌కు వెళ్లే దారిలో ప్రయాణికులు భయంగా వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడి నుంచే జిల్లా కేంద్రానికి నిత్యం వివిధ పనులపై ప్రజలు పలు వాహనాల్లో వెళ్తుంటారు. రోడ్డు ధ్వంసం కావడంతో ఆర్టీసీ బస్సు రావడం లేదు.
- బస్సుల రాకపోకలు లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

మరమ్మతులు చేపడతాం

మండలంలోని సంగారెడ్డిపేట, బూర్గుపల్లి, బుజ్రాన్‌పల్లి, చీలాపల్లి తదితర రోడ్లుకు, ఇస్రానాయక్‌తండా వద్ద కల్వర్టులకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. మిగతా చోట్ల ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

– వెంకట్, పీఆర్ ఏఈ, పెద్దశంకరంపేట



జూకల్ శివారులో రోడ్డుపై ఏర్పడిన గుంత

- జమ్లానాయక్‌తండా పరిధిలో నూతన కల్వర్టులను నిర్మించాల్సి ఉంది.
- ఇటీవల కురిసిన వర్షాలకు కలెక్టర్ రాహుల్‌రాజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కానీ, ఇప్పటివరకు ఎక్కడా కూడా తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టలేదు. అధికారులు నిర్లక్ష్యంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.